శేరిలింగంపల్లిలో బుధవారం మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు

శేరిలింగపల్లి రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి కేటీఆర్, బీఆర్ఎస్ అభ్యర్థి అరెకపూడి గాంధీ

రాష్ట్రాన్ని మింగడమే కాంగ్రెస్ పని

> కాంగ్రెస్ పార్టీ 55 ఏండ్లు పాలించినా రైతులకు సాగునీరు, ఎరువులు, ప్రజలకు తాగునీరు ఇవ్వలేకపోయింది. కారు గెలుపు పక్కా అని తేలిపోయింది. డిసెంబరు మూడో తేదీ తర్వాత నాలుగు కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నాం.
>
> - మంత్రి కేటీఆర్

కాంగ్రెస్ వస్తే ఆరు నెలలకో ముఖ్యమంత్రి

- తొమ్మిదిన్నరేండ్ల అభివృద్ధి మీ కండ్లముందే
- హైదరాబాద్‌లో ఇకపై 24 గంటల తాగునీరు
- 250 కిలోమీటర్ల మేర మెట్రోను విస్తరిస్తాం
- రూ. 25వేల కోట్లతో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థ
- అదనంగా లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు
- జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు
- హైదరాబాద్, ముల్కనూరు, చౌటుప్పల్, కోదాడ రోడ్‌షోలలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్ సిటీబ్యూరో, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): తొమ్మిదిన్నరేండ్లలో అభివృద్ధి, సంక్షేమాన్ని జోడెద్దుల్లా చేసుకొని రాష్ట్రాన్ని ప్రగతిపథంలోకి తీసుకువెళ్లామని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ పేర్కొన్నారు. ఈ ప్రగతి ఇలాగే కొనసాగాలన్నా, శాంతిభద్రతలు బాగుండాలన్నా, హైదరాబాద్ విశ్వనగరం కావాలన్నా స్థిరమైన ప్రభుత్వం, బలమైన నాయకత్వంతోనే సాధ్యమని తెలిపారు. మంచి చేసే నాయకుడిని, పనిచేసే ప్రభుత్వాన్ని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల ప్రేమ ఉంటే వచ్చే టర్మ్‌లో మెట్రోను 250 కిలోమీటర్ల వరకు విస్తరిస్తామని తెలిపారు. శివారు ప్రాంతాల్లో రూ.25 వేల కోట్లతో ఆధునిక డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. నిరంతర విద్యుత్తు మాదిరిగానే 24 గంటలు తాగునీరు సరఫరా చేస్తామని తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గ అభ్యర్థులు అరెకపూడి గాంధీ, ప్రకాశ్‌గౌడ్‌కు మద్దతుగా కేటీఆర్ రోడ్‌షో నిర్వహించారు. శేరిలింగంపల్లిలో మూడు ప్రాంతాలు తారానగర్ తుల్జాభవానీ దేవాలయం, ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, కూకట్‌పల్లి ఆల్విన్‌కాలనీ లాస్ట్‌బస్టాప్, రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని కాటేదాన్ స్వప్న థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో కేటీఆర్ ప్రసంగించారు.

కాంగ్రెస్ చేతిలో పెడితే ఆగం చేస్తారు

ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్‌ను కాంగ్రెస్ చేతిలో పెడితే ఆగం చేస్తారని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. స్కాములు చేసి రాష్ట్రాన్ని మింగాలనే కాంగ్రెస్ చూస్తుందని ఆరోపించారు. ఆరు నెలలకోసారి ముఖ్యమంత్రి మారితే హైదరాబాద్ అభివృద్ధి కునారిల్లుపోతుందన్నారు. కాంగ్రెస్ పాలనలో మైనార్టీలకు ఒరిగేదేమీ లేదన్నారు. గడిచిన 50 ఏండ్లలో మైనార్టీలు ఓట్లు వేసే యంత్రాలుగానే ఉండిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. డిసెంబర్ 3 తర్వాత ప్రతీ మహిళకు సౌభాగ్య లక్ష్మి పేరిట ప్రతి నెల రూ. 3వేలు ఇస్తామని, ఆసరా పెన్షన్లు రూ.5వేలు చేయబోతున్నామని చెప్పారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి అన్నపూర్ణ పథకం ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి కుటుంబానికి 'కేసీఆర్ బీమా.. ఇంటింటికీ ధీమా' కార్యక్రమం ద్వారా రూ. 5లక్షల జీవిత బీమాను వారం రోజుల్లో అందిస్తామన్నారు. ఆడబిడ్డలకు రూ.400లకే గ్యాస్ సిలిండర్లు అందజేస్తామన్నారు. అదనంగా లక్ష డబుల్ బెడ్‌రూం ఇండ్లు కట్టించి పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, కార్పొరేటర్లు సింధూ ఆదర్శ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చౌటుప్పల్‌లో బుధవారం మంత్రి కేటీఆర్ నిర్వహించిన రోడ్‌షోకు హాజరైన ప్రజలు

> రాష్ట్రంలో ఎక్కడైనా 3 గంటల కరెంటుతో మూడు ఎకరాల పొలం పండించే రైతులు ఉన్నారా? తాము అధికారంలోకి వస్తే ధరణిని తొలగించి మళ్లీ పటేల్, పట్వారీ దళారీ వ్యవస్థలను తీసుకొస్తామని కాంగ్రెస్ నేతలు నిస్సిగ్గుగా చెప్తున్నారు. ఈ ఎన్నికల్లో ఆ పార్టీకి 20 సీట్లు కూడా దాటవు.
>
> - మంత్రి కేటీఆర్

ధరణి కావాల్నా.. దరిద్రం కావాల్నా

హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ చౌరస్తాలో నిర్వహించిన రోడ్‌షోలో హుస్నాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల సతీశ్‌కుమార్, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, హనుమకొండ జిల్లా జడ్పీ చైర్మన్ మారెపల్లి సుధీర్‌కుమార్‌లతో కలిసి మంత్రి కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రైతన్నల భూమికి అన్ని విధాలా రక్షణ ఉండేలా తెచ్చిన ధరణి వ్యవస్థ కావాల్నా.. రైతుల భూములను ఇష్టారీతిన పరాధీనం చేసిన కాంగ్రెస్ తెస్తానంటున్న దరిద్రం కావాల్నా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడైనా 3గంటల కరెంటుతో 3 ఎకరాల పొలం పండించే రైతులు మీ వద్ద ఉన్నారా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధరణిని తొలగించి మళ్లీ పటేల్, పట్వారీ దళారీ వ్యవస్థలను ముందుకు తీసుకొస్తామని బాహాటంగా ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. 2700 కోట్లతో నిర్మించిన గౌరవెల్లి ప్రాజెక్టు ట్రయల్ రన్ రెండుసార్లు విజయవంతంగా పూర్తయిందని, లక్ష ఎకరాలు రానున్న రోజుల్లో సస్యశ్యామలం కానున్నాయని తెలిపారు. ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని కాంగ్రెస్ పార్టీ పగటి కలలు కంటుందని, వారు 20 సీట్లు కూడా దాటరని జోస్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీ చేసిన రెండు చోట్ల ఓడిపోవడం ఖాయమన్నారు. కరీంనగర్‌లో చెల్లని రూపాయి లాంటి వ్యక్తి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్‌లో ఎలా చెల్లుతాడని విమర్శించారు.

కాంగ్రెస్‌కు అవకాశమిచ్చి ఆగమవుదామా?

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే రాష్ట్రం అంధకారం అవుతుందని మంత్రి కేటీఆర్ హెచ్చరించారు. కరెంట్ కావాలంటే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావాలని, కరెంట్ వద్దనుకుంటే కాంగ్రెస్‌కు ఓటేయాలన్నారు. చేనేత మిత్ర పథకం కింద ప్రతి నెలా రూ. 5వేల ఆర్థిక సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా మునుగోడు నియోజకవర్గ పరిధిలోని చౌటుప్పల్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుట్ల ప్రభాకరరెడ్డికి మద్దతుగా నిర్వహించిన రోడ్ షోలో కేటీఆర్ ప్రసంగించారు. ఫ్లోరైడ్‌ను అంతం చేసింది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ 55 ఏండ్లు పాలించినా రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు, ఎరువులు ఇవ్వలేదని మండిపడ్డారు. డిసెంబర్ మూడో తేదీ తర్వాత నాలుగు కొత్త కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో కారు పార్టీ గెలుపు పక్కా అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, పాల్వాయి స్రవంతిరెడ్డి, రాపోలు ఆనంద భాస్కర్, ఎలిమినేటి సందీప్‌రెడ్డి, పల్లె రవి తదితరులు పాల్గొన్నారు.

కరెంటు గురించి మాట్లాడే కాంగ్రెస్‌కు సిగ్గులేదు

కరెంటుపై మాట్లాడే కాంగ్రెస్ నాయకులకు సిగ్గు, నైతికత లేదని మంత్రి కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కోదాడ అభ్యర్థి, ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ ఎన్నికల ప్రచారంలో భాగంగా కోదాడలో ఖమ్మం క్రాస్‌రోడ్ నుంచి రంగా థియేటర్ చౌరస్తా వరకు గురువారం నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. కాంగ్రెస్ హయాంలో గుంతల రోడ్లు, మురికి వాడలు, విద్యుత్ కోతలు, కాలిపోయిన మోటార్లు, పేలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లు, అర్ధరాత్రి కరెంట్ అని విమర్శలు గుప్పించారు. మల్లన్న వచ్చాక కోదాడ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. మోతె, మునగాల, నడిగూడెం మండలాలకు కాళేశ్వరం జలాలు అందుతున్నాయని తెలిపారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధికి పాటుపడే మల్లన్నను గెలిపించుకుందామా? అభివృద్ధి అడ్రస్ తెలియని కాంగ్రెస్‌కు ఓటేద్దామా? అని ప్రశ్నించారు.

- ఎన్నికల ప్రచారంపై జర్మనీ ఆరా

బీఆర్ఎస్ నర్సాపూర్ అభ్యర్థి సునీతాలక్ష్మారెడ్డి ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని జర్మనీ ఎంబసీ అధికారులు పరిశీలించారు. న్యూఢిల్లీలోని జర్మనీ ఎంబసీ అధికారులు పొలిటికల్ మినిస్టర్ కౌన్సిలర్లు మేరియస్ ఓస్వాల్డ్ సాక్షి అరోరా, సందీప్ ఏటూరి బుధవారం మెదక్ జిల్లా కొల్చారం మండలం కోనాపూర్‌లో సునీతాలక్ష్మారెడ్డిని కలిశారు. ఆమె ప్రచార రథంపై నుంచి కొద్దిసేపు పరిశీలించారు. దేశంలో ఎన్నికల విధానాన్ని తెలుసుకోవడానికి క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నట్టు వారు తెలిపారు. – కొల్చారం

కాంగ్రెస్ అధ్యక్షుడే గెలవడు

ఇక ఆ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి ఎలా వస్తుంది?

- రేవంత్‌కు కొడంగల్‌లో రెండో.. కామారెడ్డిలో మూడో ప్లేసే
- ఆయన మోదీ ఏజెంట్.. మోదీని ఒక్కమాటైనా అన్నడా?
- ఈటల రాజేందర్ కూడా రెండు చోట్లా ఓడిపోతారు
- కమలం పార్టీ సింగిల్ డిజిట్‌కే పరిమితం అవుతుంది
- వెయ్యి శాతం మేమే గెలుస్తాం.. 82 స్థానాలు బీఆర్ఎస్‌వే
- జనవరి నుంచి కొత్త రేషన్‌కార్డులు, పెన్షన్లు : కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): తెలంగాణలో మరోసారి అధికారంలోకి రాబోయేది బీఆర్ఎస్సేనని, కాంగ్రెస్ గాలి అంతా సోషల్ మీడియాలోనే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కే తారక రామారావు స్పష్టం చేశారు. ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని, 82 స్థానాలు గెలుచుకుంటామని తేల్చిచెప్పారు. పోటీ చేస్తున్న రెండు స్థానాల్లో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఓడిపోతారని, ఆ పార్టీ సీనియర్లు చాలా మంది పోటీలో ఎదురీదుతున్నారని వెల్లడించారు. బుధవారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. ఆ విశేషాలు ఆయన మాటల్లోనే.. 'తాజాగా మూడు సర్వేలు వచ్చాయి. వీటిలోనూ బీఆర్ఎస్‌కే అధికారం ఖాయమని స్పష్టం చేశాయి. కొన్ని ప్రతిష్ఠాత్మక సంస్థలు చేసిన సర్వేలు అవి. మూడింటికి మూడింటిలో 70-82 మధ్యలో సీట్లు బీఆర్ఎస్‌కు రాబోతున్నాయని తేలింది.

క్షేత్రస్థాయిలో కాంగ్రెస్‌కు అంత లేదు

కాంగ్రెస్ ఊపు అంతా సోషల్ మీడియాలోనే. క్షేత్రస్థాయి పరిశీలనలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పోటీచేస్తున్న కొడంగల్‌లో బీఆర్ఎస్ గెలువబోతున్నది. అక్కడ రేవంత్‌రెడ్డి రెండోస్థానానికి పరిమితమవుతారు. కామారెడ్డిలో మూడోస్థానమే. ఇది పక్కా. ఆయనే గెలువడు. ఇక కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందా? రాష్ట్రంలోని కాంగ్రెస్ అగ్రనేతలు, ముఖ్యనేతలందరు ఎన్నికల్లో ఎదురీదుతున్నారు. నల్లగొండలో వెంకట్‌రెడ్డి, నాగార్జునసాగర్‌లో జానారెడ్డి కుమారుడు జయవీర్‌రెడ్డి, మధిరలో భట్టివిక్రమార్క.. ఇలా అనేకమంది ఓడిపోతోతున్నారు. డిసెంబర్ 3న మీరే చూస్తారు. ఖమ్మంలో మేం కనీసం 6 సీట్లు గెలుస్తాం. మరో రెండుస్థానాల్లో పోటీ ఇస్తున్నాం. ఇల్లందు, అశ్వారావుపేట, కొత్తగూడెం, భద్రాచాలానికి ఇటీవల వెళ్లొచ్చా. ప్రజల నుంచి అద్భుతమైన స్పందన కనిపించింది. కరీంనగర్, వరంగల్‌లలో మేం సులువు అని ఊహించిన స్థానాల్లో కొంత పోటీ ఉన్నది. ఈసారి ఎవరూ ఊహించని ఫలితాలు వస్తాయి. బీజేపీ మళ్లీ సింగిల్ డిజిట్‌కే పరిమితమవుతుంది. కాంగ్రెస్‌కు గతంలో వచ్చిన సీట్లకు కొద్దిగా అటుఇటుగానే వస్తాయి తప్ప పెద్దగా ఏమీ ఉండదు.

15-18 చోట్ల బీజేపీతో మాకు పోటీ

రాష్ట్రంలో 15-18 చోట్ల బీఆర్ఎస్‌తో బీజేపీ నేరుగా తలపడుతున్నది. ఉదాహరణకు కోరుట్ల, కరీంనగర్, గోషామహాల్, హుజురాబాద్.. ఇలాంటి స్థానాల్లో బీజేపీతోనే మాకు పోటీ. ఈ స్థానాల్లో గెలిచేది బీఆర్ఎస్సే. రెండు చోట్ల పోటీచేస్తున్న బీజేపీ నేత ఈటల రాజేందర్ రెండు చోట్లా ఓడిపోతారు. కరీంనగర్‌లో బండి సంజయ్ కూడా ఓడిపోతారు. మునుగోడులో రాజగోపాల్‌రెడ్డి తీరుపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 18 స్థానాల్లో బీజేపీ రెండో స్థానంలో ఉన్నదనుకుంటే, 7 స్థానాల్లో ఎంఐఎం పార్టీలకు మినహాయిస్తే, కాంగ్రెస్ నికరంగా మాతో పోటీపడుతున్నది 94 స్థానాల్లోనే. అందులో ఆ పార్టీకి ఆశలు లేని స్థానాలు 40 వరకు ఉన్నాయి. అంటే మాతో పోటీపడేవి 54 స్థానాలే. నల్లగొండలో ఈసారి మేం 7-9 సీట్లు గెలవబోతున్నాం. ఓవరాల్‌గా బీఆర్ఎస్ పరిస్థితి యథాతథంగా ఉన్నది.

> సోషల్ మీడియాలో జరుగుతున్న కృత్రిమ ప్రచారం, వర్డ్ ఆఫ్ మౌత్‌గా మాత్రమే కాంగ్రెస్ కనిపిస్తున్నది. గతంలో బీజేపీ ఒక్కసారిగా పడిపోవడంతో అక్కడి నుంచి కొంత కాంగ్రెస్‌కు వచ్చి ఉంటుంది. కాంగ్రెస్ కూడా పాలపొంగు వంటిదే. బీఆర్ఎస్‌కు సొంత క్యాడర్ ఉన్నది. కృత్రిమ హైప్ మాకు అవసరం లేదు.

> మేం తెలంగాణను గెలిపించుకోవాలని అనుకుంటున్నాం. కాంగ్రెస్, బీజేపీ తెలంగాణను గెలవాలనుకుంటున్నాయి.
>
> -మంత్రి కేటీఆర్

నిరుద్యోగులకు భరోసా

మా ఎన్నికల ప్రచార సరళిని రోజువారీగా సమీక్షించుకుంటున్నాం. నిరుద్యోగుల విషయంలో మేం చేసింది చెప్పి, చేయబోయేదానిపై వారికి స్పష్టత ఇస్తున్నాం. యువతలో విశ్వాసం నింపేందుకు టీఎస్‌పీఎస్సీలో మరిన్ని సంస్కరణలు, ప్రక్షాళన చేయడం, లోటుపాట్లు లేకుండా రిక్రూట్‌మెంట్ జాబ్ క్యాలెండర్ విడుదల వంటివి చేపట్టాలని నిర్ణయించాం. రాబోయే వారం పాటు మా ప్రచారంలో ఇదే విషయాన్ని బలంగా తీసుకెళ్తాం. ఇక, ఈసీ అనుమతి రాగానే మిగిలిన రుణ మాఫీ కూడా పూర్తి చేస్తాం. అనుమతి రాకపోతే బీఆర్ఎస్ ప్రభుత్వం వచ్చాక డిసెంబర్ 5న తర్వాత మేమే ఇస్తాం.

ప్రజల్లోకి విస్తృతంగా కేసీఆర్ భరోసా

పోలింగ్‌కు ఇంకో వారం మాత్రమే ఉన్నది. ఈ నేపథ్యంలో కేసీఆర్ భరోసా మ్యానిఫెస్టోపై ప్రజల్లో విస్తృత చర్చ పెడుతున్నాం. ప్రభుత్వం రాగానే చెప్పినవన్నీ చేసి తీరుతాం. పెన్షన్ మొత్తాల పెంపును దశలవారీగా చేస్తాం. బీడీ కార్మికులకు కటాఫ్ తేదీలను పెంచుతాం. గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు కూడా కేసీఆర్ బీమా వర్తిస్తుందని ఇటీవల నిజామాబాద్ జిల్లా బహిరంగ సభలో తెలిపారు. ఉమ్మడి నిజామాబాద్, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈ పథకం ఎక్కువ ఉపయోగకరంగా ఉంటుంది. ఆటో డ్రైవర్లకు పర్మిట్, ఫిట్‌నెస్ చార్జీలను మాఫీ చేస్తామని సీఎం ప్రకటించారు. సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ సీట్లు ఇచ్చే క్రమంలో ముదిరాజ్‌లకు సీట్లు సర్దుబాటు చేయలేకపోయాం. ఇదే విషయాన్ని మేం నిజాయతీగా చెప్పాం. మా పార్టీ కార్యక్రమాలను చూసి ముదిరాజ్ వర్గానికి చెందిన అగ్రనాయకులు కాసాని జ్ఞానేశ్వర్, ఎర్రశేఖర్, పీ చంద్రశేఖర్, నగేశ్ ముదిరాజ్ వంటివారు బీఆర్ఎస్‌లో చేరారు. మా పార్టీలో చాలా మంది ముదిరాజ్ నేతలున్నారు. వీరివల్ల ముదిరాజ్ వర్గంలో బీఆర్ఎస్ పార్టీ తమను కాపాడుకుంటుందన్న విశ్వాసం పెరిగింది.

ఏనాడూ బీజేపీతో కలిసి పనిచేయలేదు

ఏ నాయకుడు విమర్శించని స్థాయిలో ప్రధాని మోదీని విమర్శించింది కేసీఆర్ ఒక్కరే. మేం ఏనాడూ బీజేపీతో పొత్తు పెట్టుకోలేదు. 2004లో కాంగ్రెస్‌తో, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ, కమ్యూనిస్టు పార్టీలతోనే పొత్తు పెట్టుకున్నాం. అయినా, బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్ అనటం విడ్డూరం. నిజంగా బీజేపీకి బీఆర్ఎస్ బీ టీం అయితే మా మంత్రులు, నేతలపై ఐటీ, సీబీఐ, ఈడీ దాడులు ఎందుకు జరుగుతున్నాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో ఆ రెండు పార్టీలు కలిసి పనిచేశాయని చిన్న పిల్లవాడికీ తెలుసు. కాంగ్రెస్ ఓటును బీజేపీకి వేయించారు. ఈ ఎన్నికల్లో కూడా ముగ్గురు డమ్మీ అభ్యర్థులను కాంగ్రెస్ పెట్టింది.

> హార్డ్ కోర్ ముస్లిం హేటర్స్ .. రాజాసింగ్, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్ పోటీ చేస్తున్న చోట కాంగ్రెస్ పెట్టింది డమ్మీ అభ్యర్థులనే. టీపీసీసీ అధ్యక్షుడే స్వయంగా బీజేపీ ఏజెంట్. ఆయన ఒక్క సందర్భంలోనైనా మోదీని తిట్టారా?

నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు

వ్యవసాయ మోటర్లకు మీటర్లు పెట్టకపోతే నిధులు ఇచ్చేది లేదని కరాఖండీగా చెప్పిన కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్‌కు ధన్యవాదాలు. మేం ఇదే విషయాన్ని చెప్తే బండి సంజయ్, కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ వంటి బీజేపీ నేతలు బుకాయించారు. కానీ, నిర్మలా సీతారామన్ వాస్తవాలు చెప్పారు. ఇక, తెలంగాణను అప్పుల పాలు చేశామని ఆమె వ్యాఖ్యానించారు. ఆ వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం. మేం ఏ అప్పు చేసినా కేంద్ర ఆర్థిక శాఖ నిర్దేశించిన ఎఫ్ఆర్‌బీఎం పరిమితికి లోబడే చేశాం. కేంద్ర ఆర్థిక శాఖ అనుమతి లేకుండా రాష్ట్రాలు అప్పులు చేయలేవు.

తెలంగాణ గొంతు కేసీఆర్‌ను పిసికేసే కుట్ర

తెలంగాణకు ఉన్న ఒకే ఒక గొంతు కేసీఆర్. ఆయనను తెలంగాణదాటి రాకుండా చూసుకోవాలన్నదే రాహుల్‌గాంధీ, మోదీ కుట్ర. కాంగ్రెస్ కర్ణాటక నుంచి డబ్బుల కట్టలు తెస్తున్నది. బీజేపీ గుజరాత్ నుంచి తెస్తున్నది. ఎంత వస్తున్నదన్నది మీరందరూ చూస్తున్నదే. తెలంగాణకు మనదంటూ ఒక అస్తిత్వం ఉండాలంటే కేసీఆర్ ఉండాలి. రాహుల్‌కైనా, మోదీకైనా దేశంలోని 28 రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి. కానీ, కేసీఆర్‌కు తెలంగాణే ఎపిక్ సెంటర్. వాళ్లేమో తెలంగాణను గెలవాలనుకుంటున్నారు. మేం తెలంగాణను గెలిపించుకోవాలనుకుంటున్నాం.

పవన్ కారుకూతలు

- నాడు తెలంగాణను వ్యతిరేకించి నేడు బలిదానాల గురించి మాట్లాడుతరా?
- తెలంగాణ పాలనకు కితాబు నేడు కమీషన్లని కూస్తవా?
- మోదీతో చేరి విషం చిమ్ముతవా?
- వరంగల్ సభలో పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై ప్రజల ఆగ్రహం

హైదరాబాద్, నవంబర్ 22 (నమస్తే తెలంగాణ): ప్యాకేజీ స్టార్.. పవన్ కల్యాణ్ కారు కూతలపై తెలంగాణ సమాజం భగ్గుమన్నది. నాడు తెలంగాణ ఏర్పాటును వ్యతిరేకించి నేడు అమరుల బలిదానాల గురించి మాట్లాడటం సిగ్గనిపించడం లేదా అని నిలదీసింది. తెలంగాణ ప్రకటన చేస్తే భోజనం మానేశానని రాష్ట్ర ఏర్పాటుపై అక్కసు వెళ్లగక్కిన పవన్.. నేడు తెలంగాణపై ప్రేమ ఒలకబోస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కలిసి పోటీచేస్తున్న బీజేపీ, జనసేన అభ్యర్థులు బుధవారం వరంగల్‌లో ఏర్పాటుచేసిన ప్రచార సభలో పవన్ కల్యాణ్ అడ్డగోలుగా మాట్లాడటంపై తెలంగాణ సమాజం ఆగ్రహం వ్యక్తంచేసింది. తెలంగాణలో బలిదానాలు ఇప్పుడే గుర్తొచ్చాయా? నాడు ప్రత్యేక రాష్ట్ర ఉద్యమంలో పిల్లలు పిట్టల్లా రాలుతుంటే ఎక్కడికి పోయావ్? నాడు సమైక్య పాలకుల పంచన చేరి తెలంగాణను వ్యతిరేకించలేదా? మీకు ఇప్పుడు మాత్రం తెలంగాణ కావాల్సి వచ్చిందా? అంటూ తెలంగాణ ప్రజలు నిలదీస్తున్నారు. తెలంగాణలో పాలన అద్భుతమంటూ, సీఎం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ అద్భుతంగా పురోగమిస్తున్నదని.. గతంలో కీర్తించిన అదే నోటితో అవినీతి, కమీషన్ల రాజ్యం అనడంపై అది నోరా, తాటి మట్టా? అని ఫైరవుతున్నారు. ప్రధాని మోదీతో జతకట్టగానే అభివృద్ధి తెలంగాణ.. కమీషన్ల తెలంగాణగా మారిపోయిందా? అని నిలదీస్తున్నారు.

ఏపీలో నీ సంగతి చూసుకో...

బీజేపీ బాటలో నడుస్తున్న పవన్.. తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రిని చూడాలని ఉందనడంపై నెట్టింట్లో జోకులు, సెటైర్లు పేలుతున్నాయి. బీసీగా ఉన్న నువ్వు ముందు ఏపీలో ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించుకో.. ఆ తర్వాత తెలంగాణలో బీసీ ముఖ్యమంత్రి గురించి మాట్లాడు? అంటూ చురకలంటిస్తున్నారు. ఏపీలో ఓ పార్టీకి అధ్యక్షుడిగా ఉంటూ తనకు తాను ముఖ్యమంత్రి అవుతానని ధైర్యంగా చెప్పుకోలేని పవన్.. తెలంగాణలో ముఖ్యమంత్రి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదని ఎద్దేవా చేస్తున్నారు. పచ్చని తెలంగాణలో మళ్లీ చిచ్చు పెట్టేందుకు సమైక్యవాదుల తరపున కుట్రలు చేస్తున్నావా? అని నిలదీస్తున్నారు. ఇలాంటి కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని హెచ్చరిస్తున్నారు.